నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శుక్రవారం 18 అక్టోబర్ 2024 | RANGAREDDY

వికారాబాద్ జిల్లాలోని ఓ జిన్నింగ్ మిల్లులో పత్తిపంటను విక్రయిస్తున్న రైతులు

పత్తి రైతు చిత్తు..

అకాల వర్షాలతో అప్పుడు.. ధరలేక ఇప్పుడు..

- సీసీఐ కొనుగోలు కేంద్రాల్లేక తక్కువ ధరకే అమ్ముతూ నష్టాల పాలు
- బహిరంగ మార్కెట్లో రోజురోజుకూ పతనమవుతున్న ధరలు
- రంగారెడ్డి జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో పంట సాగు.. 11.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా
- ప్రభుత్వ మద్దతు ధర కంటే రూ.2 వేలకు తక్కువగానే కొంటున్న దళారులు
- జిల్లాలో ప్రతిపాదనల దశలోనే ఉన్న 14 పత్తి కొనుగోలు కేంద్రాలు
- వికారాబాద్ జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో సాగు కాగా.. 2.30 లక్షల మెట్రిక్ టన్నులుగా అంచనా..
- కొనుగోలు కేంద్రాల్లేక పత్తిని మిల్లులకు తీసుకెళ్తున్న రైతులు..తక్కువ ధర విక్రయం
- జిల్లాలో డిసెంబర్ వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలు లేనట్లే..!

ప్రతి ఏటా పత్తి రైతు ఏదో రకంగా చిత్తవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడం, సీసీఐ పెట్టే కొర్రీలు, అకాల వర్షాలతో ఆగమవుతున్నాడు. వేలకు వేలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే ప్రతికూల వాతావరణంలో అంతంత మాత్రమే దిగుబడి వస్తున్నది. వచ్చిన ఆ కొద్ది పాటి పంటనూ అమ్ముకునేందుకు ధర లేకపోవడంతో దిగాలు పడుతున్నాడు. ప్రభుత్వం క్వింటాలుకు రూ.7,521 మద్దతు ధరను ప్రకటించగా.. ఉమ్మడి జిల్లాల్లో ఇప్పటివరకు ప్రభుత్వం ఒక్క కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. ఇది దళారులకు వరంగా మారి .. ధరను తగ్గించి కొంటున్నారు. కాగా రంగారెడ్డి జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో పంట సాగుకాగా.. 11.50 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా, 2.30 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి రానుందని అంచనా వేస్తున్నారు.

-రంగారెడ్డి/వికారాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం తంగడిపల్లిలోని పత్తి పంట

రంగారెడ్డి జిల్లాలో ఈసారి వానకాలంలో రైతులు పత్తి పంటను 1,28,720 ఎకరాల్లో సాగు చేశారు. అత్యధికంగా షాద్‌నగర్, చేవెళ్ల, కల్వకుర్తి సెగ్మెంట్లలో సాగైంది. జిల్లాలో సాగు అవుతున్న మొత్తం సాగు విస్తీర్ణంలో సింహభాగం మాడ్గుల మండలంలోనే ఉంటుంది. అయితే ఈ సారి పత్తి దిగుబడులపై రైతులు దిగులు చెందుతున్నారు. నిజానికి సీజన్ మొదట్లో పత్తి విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తనాలు వేసినా..వర్షాల్లేక రెండు, మూడుసార్లు వేయాల్సి వచ్చింది. పత్తి పూత దశకు వచ్చిన సమయంలోనూ భారీవర్షాలు పడ్డాయి. చేన్లు నీట మునిగి పూత, కాయ నేలవాలాయి. కొమ్మలు నీటిలో నాని తెగు ళ్లు సోకి దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. దీంతోపాటు ఈసారి విత్తనాల ధరలు, ఎరువులు, ఖర్చులు పెరిగి తడిసి మోపెడయ్యింది.

ఊసేలేని సీసీఐ కొనుగోలు కేంద్రాలు..

జిల్లాలో వారం, పది రోజులుగా పత్తి పంట చేతికొస్తున్నా ..కొనుగోలు కేంద్రాల జాడ కనిపించడంలేదు. పంట సీజన్‌కు ముందుగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉండగా..ఆ దిశగా అడుగులు ముందుకు పడలేదు. జిల్లాలో మొత్తం 14 జిన్నింగ్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. సంబంధిత ఫైల్ ప్రస్తుతం కలెక్టర్ వద్ద ఉన్నది. షాద్‌నగర్ ప్రాంతంలో 11 కేంద్రాలు, ఆమనగల్లు ప్రాంతంలో మూడు కేంద్రాలను నోటిఫై చేశారు. చేవెళ్ల నియోజకవర్గంలో ఉన్న జిన్నింగ్ మిల్లు యజమానులు ఈసారి కేంద్రం ఏర్పాటుకు ముందుకు రాలేదు. కేంద్రాల ప్రారంభానికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రాకపోవడంతో సంబంధిత అధికారులు ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నారు. నవంబర్ మూడోవారంలో కేంద్రాలను ప్రారంభించే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే కొన్ని చోట్ల మొదటితీతను పూర్తి చేసిన రైతులు ఇంట్లో నిల్వ చేసుకో లేక తమ పంటను తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటూ తీవ్రంగా నష్టపోతున్నారు.

ధర తగ్గించి దళారుల విక్రయాలు..

సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దళారులకు వరంగా మారింది. మొన్నటివరకు రూ.8 వేల వరకు పలికిన సాధారణ పత్తి ధర క్రమంగా తగ్గుతూ వస్తున్నది. నాణ్యతను బట్టి ప్రస్తుతం ధర రూ.5,000-రూ. 6,500 వరకు పలుకుతున్నది. ఇప్పటికే ప్రతి గ్రామంలోనూ దళారులు పత్తిని కొంటున్నారు. నాసిరకంగా ఉందంటూ సాకులు చెబుతున్నారు. వారు చెప్పిందే ధర అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. జిల్లాలో 11.50 లక్షల క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అంచనా. క్వింటాపై రూ.1,500 నుంచి రూ. 2000 వరకు ధర తగ్గితే రైతుల కు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుంది. జిల్లాలో కేవలం పత్తి క్రయవిక్రయాల విలువ సుమారు రూ.7000 కోట్ల వరకు ఉంటుంది. క్వింటాపై రూ.వెయ్యి తగ్గినా రైతులు రూ.110 కోట్ల మేర నష్టపోతారు. అదే రూ.2 వేలు పడిపోతే ఈ నష్టం రెట్టింపవుతుంది. ఇప్పటికైనా సీసీఐ స్పందించాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారని వ్యవసాయరంగ నిపుణులు పేర్కొంటున్నారు.

వికారాబాద్ జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో పంట సాగు..

వికారాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో పత్తి రైతు ధర లేక పోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నాడు. జిల్లాలోని పరిగి, వికారాబాద్ నియోజకవర్గాల్లో అధిక మొత్తంలో పత్తి సాగు అవుతుండగా.. తాండూరు, కొడంగల్ సెగ్మెంట్లలో కొంతమేర సాగవుతుంది. అయితే ఈ ఏడాది 14 కొనుగోలు కేంద్రాలను ఏర్పా టు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ ఏడాది 2.30 లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగు కాగా, 2.30 లక్షల మెట్రిక్ ట న్నుల పంట దిగుబడి రానుందని అంచనా వేస్తున్నారు.

సీసీఐ కొనుగోళ్లు ఇప్పట్లో లేనట్లే..

జిల్లాలోని తాండూరు, కొడంగల్ నియోజకవర్గాల్లో పత్తి ఏరడం ప్రారంభమైంది. అయితే కొనుగోలు కేంద్రాల ప్రారంభ ప్రక్రియ ఇం కా ప్రతిపాదన దశలోనే ఉండడం గమనార్హం. సీసీఐ ఆధ్వర్యంలో జిల్లాలో 14 జిన్నింగ్ మిల్లుల ద్వారా పత్తిని సేకరించాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించినా ఇప్పటివరకు ఒక్క జిన్నింగ్ మిల్లులో నూ పత్తి కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. దీంతో తాండూరు, కొడంగల్ సెగ్మెంట్లలో పత్తిని తీస్తున్న రైతులు ఆ పంటను మిల్లులకు తీసుకొస్తుండగా.. మరి కొంతమంది బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు.

ప్రతి ఏటా బహిరంగ మార్కెట్‌లో సీసీఐ కేంద్రాల కంటే రూ.200-రూ.300 ధర అధికంగా ఉండగా.. ఈ సారి మాత్రం ఘోరంగా పడిపోయింది. ప్రతిపాదన దశలోనే సీసీ ఐ కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఉండడంతో పత్తిని తీసుకొస్తున్న రైతులు తప్పని పరిస్థితుల్లో కనీస మద్దతు ధర కంటే చాలా తక్కువకు విక్రయిస్తూ నష్టపోతున్నా రు. బహిరంగ మార్కెట్‌లో క్వింటాలుకు రూ. 6000-రూ.6500లకు వ్యాపారులు కొం టున్నారు. అయితే సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి కొనుగోళ్ల ప్రా రంభానికి మరో నెల రోజుల సమయం పట్టే అవకాశం ఉన్నది. డిసెంబర్ నెలలో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు ప్రారంభమవుతుందని జిన్నింగ్ మిల్లుల నిర్వాహకులు చెబుతున్నారు. గత వారం రోజులుగా తాండూరు, కొడంగల్ సెగ్మెంట్లకు చెందిన రైతులు రోజుకు 1000 క్వింటాళ్ల వరకు పత్తిని మిల్లులకు తీసుకొస్తుండగా.. వారు తక్కువ ధరకే కొంటున్నార ని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు ప్రారంభమయ్యే వరకు రైతులు తక్కువ ధరకు విక్రయించి నష్టపోవాల్సిన దుస్థితి నెలకొన్నది. అంతేకాకుండా గత రెండు, మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఏరిన పత్తి తడిసిపోవడంతో ఇంట్లో నిల్వ ఉంచుకోలేక తప్పని పరిస్థితుల్లో తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్నారు.

సీసీఐ కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించాలి

వర్షాలు అధికంగా కురవడంతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నది. దానికితోడు సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో దళారులు, మధ్యవర్తులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వచ్చింది. దళారులు నాసికరంగా ఉందంటూ తక్కువ ధర చెల్లిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. – రమేశ్ రైతు, రామన్నగూడ, చేవెళ్ల మండలం

క్వింటాల్ ధర రూ.10 వేలుగా నిర్ణయించాలి

నేను నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. వానలు సకాలంలో కురవకపో వడంతో పంట ఆశాజనకంగా లేదు. అదే విధంగా ప్రస్తుతం కురుస్తున్న వానలతో పత్తి తడిసిపోయి నల్లగా అవుతున్నది. ప్రభుత్వం క్వింటాకు మద్దతు ధరను రూ. 7,121 ప్రకటించింది. ఈ ధర రైతులకు ఏ మాత్రం సరిపోదు. ప్రభుత్వం క్వింటాల్ ధరను రూ.10 వేలుగా నిర్ణయించాలి. అప్పుడే పత్తి రైతులకు నష్టాలు తగ్గి లాభాలొస్తాయి.

-ఇప్పల కృష్ణయ్య, రైతు, కడ్తాల్

గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రభుత్వం పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి వారిని ఆదుకోవాలి. తాజాగా కురుస్తున్న వానలతో పత్తి పంట నాని నల్లగా మారుతున్నది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఆ పంటను మద్దతు ధరకు కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకోవాలి. లేకుంటే వారు అప్పులపాలు అవుతారు.

– రైతు బీరయ్య, మాడ్గుల గ్రామం, మాడ్గుల

గత్యంతరం లేకే.. అమ్ముతున్నాం

అకాల వర్షాలకు తోడు, ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో అన్నదాత ఆ పంటను వ్యాపారులకు విక్రయిస్తూ నష్టాల పాలు అవుతున్నాడు. ఇటీవల కురిసిన వానలకు పంట ఎర్రబారి చచ్చిపోతున్నది. దానిని ఇంట్లో నిల్వ చేస్తే ఇంకా చెడిపోయే ప్రమాదం ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో దళారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నాం.

శేఖర్ రైతురైతు ఎక్మాయి, బషీరాబాద్

పత్తి తీయక ముందే కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ప్రభుత్వం పత్తి రైతులను ఆదుకునేందుకు వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరను ఆ పంటను కొనాలి. ఈ సారి వర్షాలు సకాలంలో కురువక పోవడంతో ఆ పంట ఆశాజనకంగా లేదు. పత్తి తీయక ముందే కొనుగోలు కేం ద్రాలను ఏర్పాటు చేస్తే ప్రభుత్వం పత్తిని కొంటుందన్న ధైర్యం అన్నదాతల్లో ఉం టుంది. –సుధాకర్‌రెడ్డి, కాశీంబౌలి, మొయినాబాద్

మద్దతు ధర రావడం లేదు..

ప్రభుత్వం రైతుబంధు డబ్బులు ఇవ్వకపోయినా.. అప్పులు చేసి పది ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. పత్తి ఇండ్లలోకి వచ్చినా ప్రభుత్వం కొనుగో లు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రైవేట్ వ్యాపా రు లు, దళారులకు విక్రయిస్తే వారు మద్దతు ధర చెల్లించడంలేదు. అన్నదాత అప్పుల పాలు కాకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. –గోవిందు యాదయ్య, రైతు, నర్సప్పగూడ

ధర లేక నష్టాల పాలు..

ఈ ఏడాది పత్తికి ధర లేక చాలా నష్టపోతున్నాం. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే అవకాశం కనిపించడం లేదు. ప్రభుత్వం పత్తికి మద్దతు ధరను పెంచి రైతులను ఆదుకోవాలి. గతేడాది రూ. 7000- 9000 వరకు పత్తికి ధర పలికింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో రూ. 5 వేలే ఉండటం చాలా దురదృష్టకరం. –కట్ట అంజయ్య, నల్లచెరువు గ్రామం, మాడ్గుల

అప్పులే మిగులుతున్నాయి..

వేలకు వేలు పెట్టుబడి పెట్టి పంటను సాగు చేస్తే అన్నదాతకు అప్పులే మిగులుతున్నాయి. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం దళారులకు వరంగా మారింది. తక్కువ ధరకు అన్నదాతల నుంచి పంటను కొనుగోలు చేస్తున్నారు.

–వీరాంజనేయులు, రైతు, అంతారం గ్రామం, చేవెళ్ల

గ్రూప్-1 మెయిన్స్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

- రంగారెడ్డి జిల్లాలో 11 పరీక్షా కేంద్రాలు..అభ్యర్థులు 8,008 మంది
- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల నిర్వహణకు జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ శశాంక గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 కేంద్రాల్లో జరిగే పరీక్షలకు 8,008 మంది హాజరు కానున్నట్లు తెలిపారు. ఈనెల 21 నుంచి 27 వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. అభ్యర్థులను మధ్యాహ్నం 12:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతిస్తారని, 1:30 నిమిషాల తర్వాత పరీక్షా కేంద్రాల గేట్లు మూసేస్తారని.. ఆ తర్వాత ఎవరినీ లోనికి అనుమతించారన్నారు. మొదటి పరీక్షకు ఉపయోగించిన హాల్ టికెట్‌ను మిగిలిన ఆరు పరీక్షలకు కూడా వినియోగించాల్సి ఉంటుందని సూచించారు. అభ్యర్థులు నలుపు లేదా నీలం బాల్ పాయింట్ పెన్నులు, పెన్సిల్, ఎరేజర్‌తోపాటు హాల్ టికెట్‌పై అతికించిన ఫొటో, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా చెల్లుబాటు అయ్యే ఒరిజినల్ ఫొటో ఐడి కార్డును మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి వెంట తీసుకెళ్లాలన్నారు. అన్ని సమాధానాలను బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే రాయాలని, అభ్యర్థి ఫొటోగ్రాఫ్, సంతకానికి సంబంధించిన చిత్రాలు స్పష్టంగా ఉంటేనే హాల్ టికెట్ చెల్లుబాటు అవుతుందన్నారు. అభ్యర్థి తమ గ్రూప్-1 సర్వీసెస్ ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఎంచుకున్న భాషలోనే అన్ని పరీక్షలు రాయాలని.. ఇతర భాషలో రాస్తే అటువంటి సమాధానాల బుక్‌లెట్లు మూల్యాంకనం చేయబడవన్నారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్‌పై ముద్రించిన సూచనలను తప్పకుండా చదువాలని సూచించారు.

ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

పరిగిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

పరిగి, అక్టోబర్ 17 : పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం పరిగిలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ.. మినీ నుంచి మెయిన్ కేంద్రాలుగా మారిన అంగన్‌వాడీ కార్యకర్తలకు ఐదు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2024 జనవరి ఒకటి నుంచి మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. మెయిన్ అంగన్‌వాడీ టీచర్లతో సమానంగా వేతనాలు కేవలం మూడు నెలలే ఇచ్చి ఆ తర్వాత నుంచి ఇవ్వడం లేదన్నారు. అదేవిధంగా రిటైర్డ్ అయిన అంగన్‌వాడీ టీచర్లకు రూ.రెండు లక్షలు ఇవ్వాలన్నారు. ధర్నాలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, పరిగి ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు మంజుల, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు శ్వేత, నిర్మల, కమలాదేవి, శాంతి, సునీత పాల్గొన్నారు.

సాయం ఉత్తమాటే!

మూసీ బాధితులకు అందని రూ.25వేలు

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు వారివి. రెక్కల కష్టాన్ని నమ్ముకునే జీవులు. మూసీ పరీవాహక ప్రాంతాల్లో కాయకష్టం చేసుకొని నిర్మించుకున్న ఇండ్లను రేవంత్ సర్కార్ భూస్థాపితం చేసింది. అలా ఇండ్లు కోల్పోయి డబుల్ బెడ్రూంల్లోకి బలవంతంగా వచ్చిన కుటుంబాలు 262. అయితే వారికి ఉపాధి దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లు ఖాళీ చేసిన వారికి రూ.25 వేల పారితోషికం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అక్టోబర్ 2న రూ.25వేలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటికీ ఆ సాయాన్ని అందించలేదు. అకస్మాత్తుగా రోడ్డున పడిన వారి బతుకులకు ఏదో ఒక రకంగా ఉపయోగపడే ఆ డబ్బులు ఇప్పటికీ అందలేదు. సాయం ఎప్పుడిస్తారు సారూ అని అధికారులను అడిగితే పండుగ తర్వాత ఇస్తామని చెబుతున్నారని బాధితులు అంటున్నారు. అయితే దసరా పండుగ ముందర కూడా ఇలానే అధికారులు సమాధానమిచ్చారని వాపోతున్నారు. ఇప్పుడు దీపావళి అనంతరం ఇస్తామని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇల్లు కోల్పోయి రోదనలో ఉన్న వారికి తక్షణం సాంత్వన చేకూర్చాల్సిన ప్రభుత్వం వారిని మరింత ఇబ్బంది పెడుతున్నదని ప్రజా సంఘాలు విమర్శిస్తున్నాయి.

-సిటీబ్యూరో, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)

అంతా అయోమయం..

ప్రజాభవన్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు మూసీ రిహాబిలిటేషన్ కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అయితే లబ్ధిదారులను ఎంపిక చేసిన రెవెన్యూ అధికారులకు ఈ కార్యక్రమంపై సమాచారం లేకపోవడం గమనార్హం. రూ. 2 లక్షల చెక్కును మహిళా పొదుపు సంఘం నుంచి ఇప్పిస్తారని కొందరు అధికారులు చెబుతుండగా.. రూ.25 వేల సాయం అయుండొచ్చని మరికొందరు అధికారులు చర్చించుకుంటున్నారు. కొసమెరుపు ఏమిటంటే చెక్కుల పంపిణీ విష యం లబ్ధిదారులకు కూడా తెలియకపోవడం విస్మయం కలిగిస్తున్నదని మరికొందరు చర్చించుకుంటున్నారు. మూసీ నిర్వాసితులను అన్ని విధాలా ఆదుకుంటామని సీఎం చెప్పినా.. ఇప్పటికీ ఆ సాయం ఎలా అందుతుందో ప్రకటించలేదు.

భయంలో మూసీ ప్రజలు..

మూసీ పరీవాహక ప్రాంతాల్లోని ఇండ్లను కూల్చడం తప్పదనే సంకేతాలను సీఎం రేవంత్‌రెడ్డి ప్రతి సమావేశంలోనూ ప్రకటిస్తూనే ఉన్నారు. దీంతో నిర్వాసితులు భయాందోళనలో ఉన్నారు. ఇప్పటికే తమ ఇండ్లపై వేలాడుతున్న రెడ్ మార్క్ ఆర్‌బీ-ఎక్స్ కత్తిని చూస్తూ నిద్ర కూడా పట్టడం లేదని వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. రేపేమాపో ఇండ్లు కూలిపోతాయోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కూల్చేసిన వారికి సాయం అందలేదు. ఉమ్మడి కుటుంబాలను తీసుకెళ్లి ఒకే డబుల్ బెడ్రూంలో పడేశారు. వారంతా ఎలా బతకాలో తెలియక సతమతమవుతున్నారు. తాగునీరు, లిఫ్ట్ పని చేయక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో తమ ఇండ్లు కోల్పోతే తాము కూడా కష్టాలు పడాల్సిందేనా అంటూ నిర్వాసితులు వాపో తున్నారు. తమ ఇండ్లు కూల్చొద్దంటూ వేడుకొంటున్నారు.

బల్దియా కమిషనర్‌గా ఇలంబర్తి బాధ్యతలు

సిటీబ్యూరో : జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఇలంబర్తి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళినీపద్మావతి, యాదగిరిరావు, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సీసీపీ శ్రీనివాస్, సీఏఆర్వో మహ్మద్ ముర్తుజాఅలీ, చీఫ్ ఎంటమాలజిస్ట్ డాక్టర్ రాంబాబు, రవికిరణ్, వెంకన్న, ఓఎస్డీ వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు కమిషనర్ ఇలంబర్తిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మా ఇల్లు మాకే కావాలి..

మూసీ సుందరీకరణ వద్దు.. మా ఇల్లు మాకే కావాలి అంటూ మూసీ పరీవాహక ప్రాంతవాసులు గురువారం రాత్రి నిరసన తెలిపారు. ఈ మేరకు తమ ఇండ్లను కాపాడాలని కోరుతూ.. రాష్ట్రపతికి, ప్రధానమంత్రికి పోస్టు కార్డులు రాసి పంపించారు.

–ఎల్బీనగర్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ)